నమస్తే తెలంగాణ
# జిందగీ
హైదరాబాద్
ఆదివారం
26 జనవరి 2025
www.ntnews.com


HAPPY Republic Day

భారత రాజ్యాంగం.. మన జాతీయ శాసనం. పౌరుల ప్రాథమిక హక్కులను కాపాడే రక్షాకవచం. ప్రభుత్వాల అధికారాలు, విధులను నిర్దేశించే అత్యున్నత చట్టం. ఇక, సినిమా.. దేశవ్యాప్తంగా విస్తరించిన ఓ శక్తిమంతమైన మాధ్యమం. వెండితెరను వారధిగా చేసుకొని.. రాజ్యాంగం కల్పిస్తున్న హక్కులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పలువురు దర్శకనిర్మాతలు సంకల్పించారు. రాజ్యాంగ విభాగాలు, కథనాల ఆధారంగా కొన్ని సినిమాలు రూపొందించారు. వీటి ద్వారా ప్రేక్షకులకు థ్రిల్‌ను పంచడంతోపాటు రాజ్యాంగ హక్కులపై పౌరులకు అవగాహన కల్పించారు.

## సినిమాటిక్.. ఆర్టికల్స్!

ARTICLES

### ఆరక్షణ్ (ఆర్టికల్ 16)




భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 16ను ప్రేరణగా తీసుకొని.. 2011లో 'ఆరక్షణ్' చిత్రాన్ని తెరకెక్కించాడు దర్శకుడు ప్రకాష్ ఝా. సామాజికంగా, మతపరంగా వెనుకబడిన ప్రజల కోసం రాజ్యాంగం కల్పించిన 'రిజర్వేషన్ వ్యవస్థ' గురించి చెబుతుందీ చిత్రం. వ్యాపారంగా మారిన విద్యావ్యవస్థ, తల్లిదండ్రుల ఆశయాలను దోపిడీ చేస్తున్న కోచింగ్ సెంటర్ల గురించీ చర్చిస్తుంది. అమితాబ్ బచ్చన్, సైఫ్ అలీ ఖాన్, దీపికా పదుకొణె, తన్వీ అజ్మీ, మనోజ్ బాజ్‌పేయి ముఖ్యపాత్రలు పోషించిన ఈ చిత్రం.. ప్రభుత్వ ఉద్యోగాల విషయంలో పౌరులందరికీ సమాన అవకాశాలు ఇవ్వాలని చెబుతుంది.

### జాలీ ఎల్ఎల్‌బీ (ఆర్టికల్ 21)



సుభాష్ కపూర్ దర్శకత్వంలో.. కోర్ట్ డ్రామాగా ప్రేక్షకుల ముందుకొచ్చింది 'జాలీ ఎల్ఎల్‌బీ' చిత్రం. 2013లో వచ్చిన ఈ సినిమా.. భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 21ని ప్రస్తావిస్తుంది. చట్టం దృష్టిలో అందరూ సమానమేనని చెబుతుంది. ప్రతి ఒక్కరికీ జీవించే హక్కు.. వారి స్వేచ్ఛను కాపాడుకునే హక్కు ఉందన్న విషయాన్ని చాటుతుంది. ఇందులో అర్షద్ వార్సీ, అమృతా రావు, బోమన్ ఇరానీ ప్రధాన తారాగణం.

### సత్యాగ్రహ (ఆర్టికల్ 19)



భారత రాజ్యాంగాన్ని స్ఫూర్తిగా తీసుకొని డైరెక్టర్ ప్రకాష్ ఝా తెరకెక్కించిన పొలిటికల్ డ్రామా.. సత్యాగ్రహ. రాజకీయాల నేపథ్యంలో సాగే ఈ చిత్రం.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19ని హైలైట్ చేస్తుంది. దేశంలో ప్రతి ఒక్కరికీ ఆయుధాలు లేకుండా శాంతియుతంగా సమావేశమయ్యే హక్కు, స్వేచ్ఛ ఉందని చెబుతుంది. తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించడానికి, ఉమ్మడిగా నిరసన తెలిపే హక్కు ఉందని చాటుతుంది. 2013లో వచ్చిన ఈ చిత్రంలో అమితాబ్ బచ్చన్, అజయ్ దేవ్‌గణ్, కరీనా కపూర్, అర్జున్ రాంపాల్, మనోజ్ బాజ్‌పేయి లాంటి అగ్రనటులు కీలక పాత్రలు పోషించారు.

### ముల్క్ (ఆర్టికల్ 20(3))



2018లో వచ్చిన మరో లీగల్ కోర్ట్ డ్రామా.. ముల్క్! నిజ జీవిత సంఘటనల నుంచి ప్రేరణ పొంది.. ఈ చిత్రాన్ని రూపొందించారు డైరెక్టర్ అనుభవ్ సిన్హా. సినిమా కథ ఉత్తర్‌ప్రదేశ్‌లోని వారణాసి, లక్నో నేపథ్యంలో.. ముస్లిం కుటుంబం చుట్టూ తిరుగుతుంది. రాజ్యాంగంలోని ఆర్టికల్ 20(3) ప్రాముఖ్యాన్ని నొక్కి చెబుతుంది. నేరారోపణలు ఎదుర్కొంటున్న ఏ వ్యక్తిని అయినా.. ఎలాంటి ఆధారాలు లేకుండా దోషిగా చూడకూడదని ఈ ఆర్టికల్ సూచిస్తుంది. ఇంకో మాటలో చెప్పాలంటే.. నేరం రుజువయ్యే దాకా ఆ వ్యక్తి నిర్దోషే! అని చెబుతుంది. ఈ చిత్రంలో తాప్సీ పన్ను, రిషి కపూర్ నటించారు.

### సెక్షన్ 375 (సెక్షన్ 375)




ఐపీసీలోని సెక్షన్ 375ను ప్రేరణగా తీసుకొని, లీగల్ థ్రిల్లర్ కోర్ట్ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కించాడు దర్శకుడు అజయ్ బహ్ల్. అన్యాయానికి, అత్యాచారానికి గురైన మహిళల హక్కులను పరిరక్షించాలని ఈ చిత్రంలో చెప్పాడు. 2019లో విడుదలైన ఈ సినిమాలో అక్షయ్ ఖన్నా, రిచా చద్దా కీలక పాత్రల్లో నటించారు.

భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి నేటికి సరిగ్గా 75 ఏండ్లు పూర్తవుతాయి. స్వతంత్ర భారతదేశ పాలన కోసం తగిన రాజ్యాంగాన్ని రూపొందించడానికి రాజ్యాంగ సభ ఏర్పడింది. ఈ సభలో మొత్తం 299 మంది సభ్యులు ఉన్నారు. వీరిలో 15 మంది మహిళలకు ప్రాతినిధ్యం లభించింది. వీరంతా స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. వివిధ రంగాల్లో తమదైన ముద్రవేశారు. ప్రపంచవ్యాప్తంగా మహిళలకు పరిమితమైన హక్కులు ఉన్న సమయంలో రాజ్యాంగ సభలో ఈ 15 మంది సభ్యులు పురుషులతోపాటు మహిళలకూ సమాన హక్కుల కోసం గొంతెత్తారు.



రాజ్యాంగ సభలో గళం వినిపించిన 15 మంది మహిళల్లో పదకొండు మంది.. నిలబడిన వారు (ఎడమ నుంచి) కమలా చౌధరీ, సుచేత కృపలాని, దుర్గాబాయి దేశ్‌ముఖ్, బేగం ఐజాజ్ రసూల్, పూర్ణిమా బెనర్జీ, దాక్షాయణి వేలాయుధన్. కూర్చున్నవారు (ఎడమ నుంచి) రేణుకా రాయ్, హంసా మెహతా, అమృత్‌కౌర్, అనీ మాస్కరీన్, అమ్ము స్వామినాథన్.

# రాజ్యాంగ సభలో ఆమె గొంతుక

### అమ్ము స్వామినాథన్

కేరళ రాష్ట్రం పాల్ఘాట్ జిల్లాలో జన్మించారు. స్వాతంత్ర్య సమరయోధురాలు. 1946లో మద్రాస్ ప్రావిన్సు నుంచి రాజ్యాంగ సభకు ఎన్నికయ్యారు. రాజ్యాంగంలో ప్రాథమిక హక్కులు, ఆదేశిక సూత్రాల గురించి విస్తృతంగా చర్చించారు. 1952లో లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1975లో అంతర్జాతీయ మహిళా సంవత్సర ప్రారంభోత్సవం నాడు 'మదర్ ఆఫ్ ద ఇయర్'గా ఎంపికయ్యారు.

### దాక్షాయణి వేలాయుధన్

రాజ్యాంగ సభకు ఎన్నికైన ఏకైక దళిత మహిళ. డాక్టర్ అంబేద్కర్‌తో షెడ్యూల్డ్ కులాల ప్రజల అభ్యున్నతి కోసం కృషి చేశారు. రాజ్యాంగంలో వికేంద్రీకరణ నియమాల గురించి అంబేద్కర్‌తో చర్చించారు.

### బేగం ఐజాజ్ రసూల్

పంజాబ్ రాష్ట్రం మాలేర్‌కోట్లలో జన్మించారు. యునైటెడ్ ప్రావిన్సెస్ (ఇప్పటి ఉత్తరప్రదేశ్) నుంచి రాజ్యాంగ సభకు ఎన్నికయ్యారు. సభలో ఏకైక ముస్లిం మహిళగా చరిత్రలో నిలిచిపోయారు. రిజర్వేషన్లు, మైనారిటీ హక్కులు, ఆస్తి హక్కు మొదలైన అంశాల్లో రాజ్యాంగ సభ చర్చల్లో పాల్గొన్నారు.

### దుర్గాబాయి దేశ్‌ముఖ్

రాజమండ్రిలో జన్మించారు. స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. జాతీయ భాష, మానవ అక్రమ రవాణా, స్వతంత్ర న్యాయవ్యవస్థ మొదలైన విషయాల్లో రాజ్యాంగ సభ చర్చల్లో తనదైన ముద్రవేశారు. మహిళా సాధికారత లక్ష్యంగా ఆంధ్ర మహిళా సభను స్థాపించారు. ప్రణాళిక సంఘంలో సభ్యురాలిగా ఉన్నారు. విద్య, సమాజ సంక్షేమ రంగాల్లో సేవలకుగాను పద్మవిభూషణ్ పురస్కారం అందుకున్నారు.

### హంసా జీవరాజ్ మెహతా

గుజరాత్‌కు చెందిన హంసా మెహతా ఇంగ్లాండ్‌లో జర్నలిజం, సామాజిక శాస్త్రం చదువుకున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్నారు. బొంబాయి ప్రావిన్సు నుంచి రాజ్యాంగ సభకు ప్రాతినిధ్యం వహించారు. రాజ్యాంగ సభలో మహిళల హక్కులు, రిజర్వేషన్లు తదితర అంశాలపై చర్చలు జరిపారు. 1950లో ఐక్యరాజ్య సమితి మానవ హక్కుల సంఘం తొలి ఉపాధ్యక్షురాలిగా నియమితులయ్యారు. పద్మభూషణ్ పురస్కారం అందుకొన్నారు.

### కమలా చౌధరీ

లక్నోలో జన్మించిన కమల 1930లో శాసన ఉల్లంఘన ఉద్యమంలో పాల్గొన్నారు. 1946లో రాజ్యాంగ సభకు యునైటెడ్ ప్రావిన్సెస్ నుంచి ఎన్నికయ్యారు. 1962లో హాపూర్ నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ప్రముఖ రచయిత్రి.

### లీలా రాయ్

అస్సాంకు చెందిన లీలా రాయ్ 1923లో స్నేహితులతో కలిసి దీపాలి సంఘ అనే సంస్థను స్థాపించారు. పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యాంగ సభకు ఎన్నికయ్యారు. దేశ విభజనకు నిరసనగా తన సభ్యత్వానికి రాజీనామా చేశారు. మహిళల కోసం జయశ్రీ పత్రికను స్థాపించి, దానికి సంపాదకురాలిగా వ్యవహరించారు.

### మాలతి చౌధురీ

తూర్పు బెంగాల్ (బంగ్లాదేశ్)లో జన్మించారు. 1921లో తన 16వ ఏటనే రవీంద్రనాథ్ ఠాగూర్ స్థాపించిన శాంతి నికేతన్‌లో చేరారు. స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. ఒడిశాలో రైతాంగ పోరాటంలో భాగమయ్యారు. జమీందారి వ్యవస్థ రద్దుకోసం కృషిచేశారు. ఒడిశా నుంచి రాజ్యాంగ సభకు ఎన్నికయ్యారు. కానీ, తర్వాత తన సభ్యత్వానికి రాజీనామా చేశారు.

### పూర్ణిమ బెనర్జీ

ఉత్తరప్రదేశ్ అలహాబాద్ జాతీయ కాంగ్రెస్ కమిటీ కార్యదర్శిగా పనిచేశారు. క్విట్ ఇండియా ఉద్యమంలో పాల్గొన్నారు. యునైటెడ్ ప్రావిన్సెస్ నుంచి రాజ్యాంగ సభకు ఎన్నికయ్యారు. రాజ్యాంగ సభలో ప్రవేశిక, రాజ్యసభ సభ్యుల అర్హతలు, ప్రివెంటివ్ డిటెన్షన్ (ముందస్తు అరెస్టు) మొదలైన అంశాల గురించి చర్చించారు.

### రాజకుమారి అమృత్‌కౌర్

మహాత్మాగాంధీ కార్యదర్శిగా 16 సంవత్సరాలు పనిచేశారు. ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఏఐఐఎంఎస్)ను ఏర్పాటు చేయాలని, దానికి స్వతంత్ర ప్రతిపత్తి ఇవ్వాలని కోరారు. ఫలితంగా 1956లో ఢిల్లీలో ఎయిమ్స్ ఏర్పాటైంది. యునైటెడ్ ప్రావిన్సెస్ నుంచి రాజ్యాంగ సభకు ఎన్నికయ్యారు. రాజ్యాంగంలో ఉమ్మడి పౌరస్మృతి, అందరికీ ఓటు, మతపరమైన హక్కులకు సంబంధించిన చర్చల్లో పాల్గొన్నారు. స్వతంత్ర భారతదేశంలో మొదటి ఆరోగ్యశాఖా మంత్రి అమృత్ కౌర్ కావడం గమనార్హం.



### సరోజినీ నాయుడు

భారతీయ ఆంగ్ల కవయిత్రి అయిన సరోజినీ నాయుడు 'నైటింగేల్ ఆఫ్ ఇండియా'గా ప్రసిద్ధి చెందారు. హైదరాబాద్‌లో జన్మించారు. ఇక్కడే చదువుకున్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించారు. 1925లో భారత జాతీయ కాంగ్రెస్‌కు అధ్యక్షత వహించారు. ఈ పదవిని చేపట్టిన తొలి భారతీయ స్త్రీ సరోజినీ నాయుడు కావడం విశేషం. బీహార్ నుంచి రాజ్యాంగ సభకు ప్రాతినిధ్యం వహించారు. రాజ్యాంగ సభలో జాతీయ పతాకం విషయంలో ఏర్పాటైన ఉపసంఘంలో సభ్యురాలిగా ఉన్నారు.

### రేణుకా రాయ్

లండన్ స్కూల్ ఆఫ్ ఎకానమిక్స్‌లో బీఏ చదువుకున్నారు. పశ్చిమ బెంగాల్ నుంచి రాజ్యాంగ సభకు ఎన్నికయ్యారు. మహిళల హక్కులు, మైనారిటీల విషయాలు మొదలైన వాటి గురించి రాజ్యాంగ సభలో తన గళం వినిపించారు. 1957 నుంచి 1967 వరకు మాల్దా నుంచి లోక్‌సభకు ప్రాతినిధ్యం వహించారు.

### సుచేత కృపలాని

హర్యానా రాష్ట్రం అంబాలా పట్టణంలో జన్మించారు. 1942లో క్విట్ ఇండియా ఉద్యమంలో అరెస్టయ్యారు. యునైటెడ్ ప్రావిన్సెస్ నుంచి రాజ్యాంగ సభకు ఎన్నికయ్యారు. జాతీయ పతాకం కోసం ఏర్పాటైన ఉపసంఘంలో సభ్యురాలిగా ఉన్నారు. ఉత్తరప్రదేశ్ సీఎంగా పనిచేశారు. దేశంలో తొలి మహిళా ముఖ్యమంత్రిగా చరిత్రలో నిలిచిపోయారు.

### విజయలక్ష్మి పండిట్

ఉత్తరప్రదేశ్‌లోని అలహాబాద్‌లో జన్మించారు. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ సోదరి. 1937– 1939 యునైటెడ్ ప్రావిన్సెస్ విధానసభకు ఎన్నికయ్యారు. స్థానిక సంస్థలు, ప్రజారోగ్య మంత్రిగా పనిచేశారు. భారతదేశంలో మంత్రి పదవి చేపట్టిన తొలి మహిళగా నిలిచిపోయారు. ఐక్యరాజ్య సమితి సాధారణ సభకు ఎన్నికైన తొలి మహిళా అధ్యక్షురాలు కూడా విజయలక్ష్మి పండిట్ కావడం గమనార్హం.

### అనీ మాస్కరీన్

కేరళలో స్వాతంత్ర్య పోరాటంలో చురుగ్గా పాల్గొన్నారు. భారతదేశంలో సంస్థానాల విలీనం కోసం కృషిచేసిన నాయకులలో ఆమె ఒకరు. కొచ్చిన్– ట్రావెన్‌కూర్ సంస్థానం తరపున రాజ్యాంగ సభకు ఎన్నికయ్యారు. సమాఖ్య వ్యవస్థ గురించి రాజ్యాంగ సభలో మాట్లాడారు. 1952 ఎన్నికల్లో తిరువనంతపురం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా లోక్‌సభకు ఎన్నికయ్యారు.

... సుజాత వేమూరి

## చైల్డ్‌లేబర్ టూ ఆస్కార్!


**ఆస్కార్** సందడి మొదలైంది. ఈ ఏడాది భారత్ నుంచి 'అనూజ' లఘుచిత్రం.. ఈ ప్రతిష్ఠాత్మక అవార్డుల రేసులో నిలిచింది. బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్ విభాగంలో ఈ చిత్రం నామినేట్ అయ్యింది. అయితే, సినిమా కన్నా ఎక్కువగా.. అందులో టైటిల్ రోల్ (అనూజ పాత్ర) పోషించిన తొమ్మిదేళ్ల 'సజ్దా పఠాన్' గురించే ఎక్కువ చర్చ నడుస్తున్నది. 'అసలు ఎవరీ అమ్మాయి?' అంటూ నెట్టింట వెతుకులాట మొదలైంది. ఆమె బ్యాక్‌గ్రౌండ్ గురించి తెలుసుకోవాలంటే.. ఢిల్లీ గల్లీల్లోకి వెళ్లాల్సిందే! నిరుపేద కుటుంబానికి చెందిన సజ్దా పఠాన్.. ఓ బాలకార్మికురాలు. బాగా



చదువుకోవాలన్న ఆశ ఉన్నా.. పేదరికం వల్ల పనికి వెళ్లేది. ఈ క్రమంలో నటి మీరా నాయర్ ఆధ్వర్యంలో నడుస్తున్న 'సలామ్ బాలక్ ట్రస్ట్' స్వచ్ఛంద సంస్థ.. సజ్దాకు అండగా నిలిచింది. ఆమెకు ఆశ్రయం కల్పించి, చదువు చెప్పిస్తున్నది. నటనపై ఆసక్తి ఉన్న సజ్దా.. ఓవైపు చదువుకుంటూనే మరోవైపు నటనా రంగంలోనూ రాణిస్తున్నది. 'ద బ్రెయిడ్' అనే ఫ్రెంచ్ సినిమా ద్వారా సినీరంగానికి పరిచయమైంది. 'అనూజ' ఆమె నటించిన రెండో సినిమా. ఇలా.. రెండో చిత్రంతోనే ఆస్కార్ బరిలో నిలవడంతో అందరూ సజ్దాపై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. 'అనూజ' చిత్రానికి ఆడమ్ జె గ్రేవ్స్, సుచిత్రా మట్టయి దర్శకత్వం వహించగా.. గునీత్ మోంగా, ప్రియాంక చోప్రా ఎగ్జిక్యూటివ్ నిర్మాతలుగా వ్యవహరించారు.

## మరో తార మెరిసింది

**బాలీవుడ్‌లో** మరో తార మెరిసింది. రవీనా టాండన్ సినీ వారసురాలు రాషా తడానీ.. తన తొలి చిత్రంతోనే సత్తాచాటింది. స్టన్నింగ్ లుక్స్.. అద్భుతమైన హావభావాలతో ప్రేక్షకులను కట్టిపడేసింది. అజయ్ దేవ్‌గణ్ మేనల్లుడు అమన్ దేవ్‌గణ్ సరసన 'ఆజాద్' సినిమాతో రాషా తడానీ ఇటీవలే ప్రేక్షకుల ముందుకొచ్చింది. తొలి ప్రదర్శనతోనే అందరి మనసులనూ కొల్లగొట్టింది.



ఆమె డ్యాన్స్, హావభావాలు చూసిన సినీ విమర్శకులు.. తోటి స్టార్‌కిడ్స్‌కు గట్టి పోటీ ఇస్తుందని అంటున్నారు. బాలీవుడ్‌లో ఎంట్రీ ఇస్తున్న స్టార్‌కిడ్స్.. రాషాను చూసి నేర్చుకోవాలని సలహాలు ఇస్తున్నారు. ఆమె దగ్గర నటనలో, భావవ్యక్తీకరణలో ప్రత్యేక తరగతులు తీసుకోవాలని చెబుతున్నారు. నిజానికి రాషా తెరపై కనిపించకముందే.. తన గాత్రంతో బీటౌన్ హృదయాలను గెలుచుకుంది. ఎందుకంటే.. ఈ స్టార్‌కిడ్ మంచి గాయని కూడా! ఇక బాలీవుడ్‌లో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న రవీనా టాండన్.. తెలుగు ప్రేక్షకులకూ పరిచయమే! గతంలో 'బంగారు బుల్లోడు' వంటి పలు సూపర్‌హిట్ సినిమాల్లో నటించిందీ అందాల తార. కేజీఎఫ్–2లోనూ రమికా సేన్ పాత్రలో దక్షిణాది ఆడియెన్స్‌ను అలరించింది.

## ఆడవాళ్లకే ఎక్కువగా

**చలి** తీవ్రత ఏమాత్రం తగ్గడంలేదు. ఉదయం తొమ్మిది దాటుతున్నా.. గజగజా వణకడం మాత్రం తప్పడంలేదు. అయితే, చలిలో ఆడవాళ్లే ఎక్కువగా వణుకుతుండటం ఎప్పుడైనా గమనించారా? 'అది నిజమే!' అని వైద్య నిపుణులు అంటున్నారు. ఎందుకంటే.. పురుషులతో పోలిస్తే, మహిళలే ఎక్కువగా చలి బారినపడతారట. ఇందుకు కారణాలు అనేకం. అందులో మొదటిది.. మహిళల్లో హార్మోన్ల అసమతుల్యత. నెలసరి కారణంగా శరీరంలో.. ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరాన్ హార్మోన్లలో హెచ్చుతగ్గులు ఏర్పడతాయి. ఇవి, శరీర ఉష్ణోగ్రతను ప్రభావితం చేస్తాయి. అంతేకాకుండా, మహిళల్లో జీవక్రియ రేటు తక్కువగా ఉండటం కూడా మరో కారణం. దీనివల్ల శరీరంలో తక్కువ వేడి ఉత్పత్తి అవుతుంది. ఉష్ణోగ్రత తగ్గడం వల్ల వారికి మరింత చలిగా అనిపిస్తుంది. మహిళల శరీరంలో ఎక్కువ మొత్తంలో పేరుకుపోయే కొవ్వు.. అంతర్గత వేడిని ప్రసరింపజేసే రక్త ప్రవాహాన్ని అడ్డుకుంటుంది. ఫలితంగా, మహిళలు మరింత చలిని అనుభవిస్తారని నిపుణులు చెబుతున్నారు.